సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023

న్యూస్‌రీల్

జిల్లా కోర్టులో 'కంటివెలుగు'



పరీక్షలు చేసుకుంటున్న జిల్లా జడ్జి నాగరాజు

పెద్దపల్లిరూరల్: జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరంలో కోర్టు ఉద్యోగులు, సిబ్బంది కుటుంబసభ్యుల తోపాటు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు పరీక్షలు చేయించుకున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు కంటి పరీక్ష చేయించుకున్నారు. బార్‌అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు, డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్ తదితరులున్నారు.

జూలపల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీ

జూలపల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సోమవారం పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ సందర్శించారు. రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యలను అడిగి తెలుసుకుని దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఏసీపీ మహేశ్, సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై వెంకటకృష్ణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


ప్రయోగాలతో గుణాత్మకమైన విద్య



ప్రయోగాలు చేస్తున్న రిసోర్స్ పర్సన్‌లు

పాలకుర్తి: విద్యార్థుల్లో పరిశీలనాత్మక శక్తిని పెంపొందించి.. గుణాత్మక విద్య అందించేందుకు జిల్లాలో సంచార ప్రయోగశాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు తెలిపారు. మండలంలోని బసంత్‌నగర్, కన్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సంచార ప్రయోగశాల ద్వారా గణితం, భౌతిక, రసాయన, జీవశాస్త్రాలపై ప్రయోగాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరో తరగతి నుంచి పది వరకు పాఠ్యపుస్తకాల్లోనూ దాదాపు 60 అంశాలను సులభంగా అర్థమయ్యేలా వివరిస్తున్నామని రవినందర్‌రావు తెలిపారు. హెచ్ఎం మాధురి, రిసోర్స్ పర్సన్‌లు గూళ్ల అంజన్‌కుమార్, రవీందర్, భూంరావు, హరిప్రసాద్, రవూఫ్, సుజాత, శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌బీఐ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: డబ్బు విలువైందని, ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేస్తూనే.. భవిష్యత్ అవసరాల కోసం కొంత పొదుపు చేసుకోవాలని కలెక్టర్ సంగీత అన్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) ముద్రించిన 'సరైన ఆర్థిక వ్యవహారమే మిమ్మల్ని కాపాడుతుంది' పోస్టర్‌ను అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్‌తో కలిసి కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. డబ్బును ఖర్చు చేసేందుకు ప్రణాళిక ఉండాలన్నారు. విచ్చలవిడిగా, దుబారా ఖర్చు చేస్తే భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. జిల్లా అధికాలు ఆదిరెడ్డి, శ్రీధర్, ప్రవీణ్‌రెడ్డి తదితరులున్నారు.

పత్తి క్వింటాల్‌కు రూ.7,722

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు సోమవారం రూ.7,722 పలికింది. కనిష్ఠంగా రూ.6,811, సగటున రూ.7,601గా నమోదైందని మార్కెట్ కమిటీ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.



- తీరం చేరిన ప్రేమకథలు
- లవ్‌లో లైఫ్‌లో గెలిచిన ప్రేమ పక్షులు
- ఆదర్శంగా నిలుస్తున్న జంటలు
- నేడు వాలెంటైన్స్ డే ప్రత్యేక కథనం

ఒప్పించాం.. మెప్పించాం!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రేమ.. కులమతాలకు అతీతమైన భావన. టీనేజీ వయసులో మొదలయ్యే ప్రేమకథలు ఆకర్షణతో మొదలై.. అక్కడితో ముగుస్తాయి. కానీ, పరిణతితో కూడిన ప్రేమకథలు కచ్చితంగా విజయతీరాలు చేరతాయి. ఒక చేత్తో కెరీర్, మరో చేత్తో ప్రేమను సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతాయి. ఖండాలు దాటినా, ఏళ్లకు ఏళ్లు గడిచినా ఎదురుచూపుల్లోనే బతికేస్తారు. చివరికి తమ లక్ష్యాన్ని చేరుకుంటారు. ఆ తరువాత పెద్దల్ని ఒప్పిస్తారు. కొందరికి ఈ అవకాశం లేకపోవచ్చు. అయినా వీరు చేరుకున్న విజయతీరాలు, సమాజంలో వీరికి దొరికే స్థానం వీరిపై ఉన్న వ్యతిరేక భావనను క్రమంగా దూరం చేస్తుంది, అందరినీ దగ్గర చేస్తుంది. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కులమతాలకు అతీతంగా ప్రేమ వివాహాలు చేసుకుని నలుగురికీ ఆదర్శంగా నిలిచిన ప్రేమజంటలపై కథనం.



మాది లవ్ కం అరేంజ్ మ్యారేజ్

సిరిసిల్లక్రైం: విద్యాభ్యాసం పూర్తి చేసి ఉద్యోగంలో సెటిల్ అయ్యాక మా స్నేహితులతో మా మధ్య ప్రేమ చిగురించింది. పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకోవాల్సిన అవసరం రాలేదు. అందరినీ ఒప్పించి సంప్రదాయ పద్ధతిలో పెళ్లి చేసుకున్నాం. నా భార్య దివ్యాన్షీ కంటి డాక్టర్. ఈ తరం యువతకు నేను చెప్పేది ఒక్కటే. కెరీర్‌పై దృష్టి పెట్టి లక్ష్యం సాధిస్తే అన్ని వచ్చి చేరుతాయి. ఆకర్షణకు గురైతే లైఫ్ ఆగమవుతుంది. – సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్– డాక్టర్ దివ్యాన్షీ దంపతులు

అనాథ యువతికి అన్నీ తానై..



శేఖర్, రమ్య దంపతులు

కథలాపూర్(వేములవాడ): అనాథ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకొని ఆదర్శంగా నిలిచాడు ఓ సామాజిక సేవకుడు. కథలాపూర్ మండలం తాండ్య్రాల గ్రామానికి చెందిన కాసారపు శేఖర్ షైన్ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు లేని అదే గ్రామానికి చెందిన రమ్యను ప్రేమించాడు. 2013లో శేఖర్, రమ్య ప్రేమ వివాహం చేసుకున్నారు. తల్లిదండ్రులు లేని ఆమెకు అన్నీ తానయ్యాడు. వీరికి శ్రీహర్ష, రిషికేశ్ ఇద్దరు కుమారులు. శేఖర్ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో 2018లో గవర్నర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నాడు. కులాంతరమే కాదు.. అనాథ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్న శేఖర్‌ను పలువురు అభినందించారు.

నేనే ప్రపోజ్ చేశా..



ఏదో సందర్భంలో తన ఫ్రెండ్ ప్రశాంత్‌ను పరిచయం చేశారు. ఆ పరిచయమే కొన్నాళ్లకు ఇష్టంగా మారింది. ధైర్యం చేసి నేనే పెళ్లి ప్రేమను ప్రతిపాదించా. అమ్మానాన్న అంగీకరించలేదు. గొడవలు కూడా అయ్యాయి. సొంతంగా నిర్ణయం తీసుకుని అగ్రహారం ఆంజనేయ స్వామి సన్నిధిలో పెళ్లి చేసుకున్నాం. కొన్నాళ్ల తరువాత ఇరు కుటుంబాల వాళ్లు అంగీకరించి కలిసిపోయారు. ప్రస్తుతం అంతా సంతోషంగానే ఉంది. – లహరి, ప్రశాంత్

'ఆదర్శం'గా నిలుస్తున్నారు



కోల్‌సిటీ:గోదావరిఖనిలోని దుర్గానగర్‌కు చెందిన పాలసాని శ్రీనివాస్, వనజారాణి 1982లో ప్రేమ వివాహం చేసుకున్నారు. శ్రీనివాస్ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి. వనజారాణి స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్). వీరికి కూతురు, కుమారుడు సంతానం. శ్రీనివాస్, వనజారాణి కులాలు వేరు కావడంతో కుటుంబసభ్యులు అభ్యంతరం తెలిపారు. స్నేహితులే గుడిలో ప్రేమ వివాహం జరిపించారు. 40 ఏళ్లకాలంలో ఎప్పుడూ గొడవలు రాలేదని, ఐదు నిమిషాల్లోనే రాజీకొస్తామంటున్నారు ఈ దంపతులు.



రవికిరణ్, స్వాతి దంపతులు

ప్రేమ ముందు ఓడిన వైకల్యం

పెద్దపల్లిరూరల్: 'నా స్వాతి బంగారం.. నేను మరుగుజ్జుగా పుట్టినా నాకు ఆ భగవంతుడు స్వాతి రూపంలో మంచి జీవితాన్నే ఇచ్చాడు' అని చెప్పుకొచ్చాడు రవికిరణ్. స్వాతి కుటుంబం ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు నుంచి పెద్దపల్లికి వలస వచ్చింది. వారు రవికిరణ్ ఇంటి సమీపంలో అద్దెకు రావడంతో స్వాతితో ఏర్పడ్డ పరిచయం పరిణయానికి దారితీసింది. స్వాతి కుటుంబీకులు వ్యతిరేకించడంతో అప్పటి సీఐ హబీబ్‌ఖాన్‌ను ఆశ్రయించగా ఠాణాలోనే పెళ్లి జరిపించారని రవికిరణ్, స్వాతి పేర్కొన్నారు. వారికి ఓ బాబు, ఇద్దరు కూతుళ్లు జన్మించినా అనారోగ్య కారణాలతో బాబు, ఓ కూతురు చనిపోయారని బాధపడ్డారు. అయినా ఉన్న ఒక్కగానొక్క కూతురు ఆశాజ్యోతిని తమకున్నంతలో అల్లారుముద్దుగా పెంచుతున్నారు. మరుగుజ్జునైన తనకు ప్రభుత్వం నుంచి దివ్యాంగ పింఛన్ అందుతోందని, మెప్మాలో పనిచేసినందుకు మరో నాలుగు వేలతోనే నెట్టుకొస్తున్నన్నాడు.

ఖండాలు దాటిన ప్రేమ



నేను ఎస్సారార్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నక్రమంలో నాకు రమేశ్ పరిచయమయ్యాడు. రోజూ మా కాలేజీకి వచ్చేవాడు. ఒకరోజు నాకు ప్రపోజ్ చేశాడు. అయితే, జీవితంలో పైకి రావాలన్న నా కలను వివరించాను. అయినా తను వెనకడుగు వేయలేదు. నాకు పూర్తిగా సహకరించాడు. ఉన్నత విద్య కోసం నేను బ్రిటన్ వెళ్లాను. పీజీ పూర్తయి ఉద్యోగంలో చేరాక ఇండియా వచ్చాను. నా కోసం ఎదురుచూస్తున్న రమేశ్‌తో వివాహం జరిగింది. కులాలు వేరుకావడంతో మొదట్లో మా పెద్దలు వ్యతిరేకించినా.. కెరీర్‌లో నిలదొక్కుకున్న తీరుకు మా ప్రేమను అంగీకరించారు. ఇపుడు లండన్‌లో రెండు రెస్టారెంట్లు, ఒక కేక్‌షాప్ నడుపుతున్నాం. నలుగురికి ఉపాధి కల్పిస్తున్నం. ఏటా మా ఇద్దరి పిల్లలతో ఇండియాకు వస్తాం. – సుష్మ– రమేశ్

ప్రేమ కోసం దేశంలోనే..



మాది మంథని, మా వారిది కరీంనగర్. నేను అపుడు పీజీ చదువుతున్నా. మా ఆయన ప్రభాకర్ అప్పటికే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఒక పెళ్లి వేడుకలో అనుకోకుండా కలిశాం. పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నాం. మాకు ఇపుడు ఒక పాప. మా ప్రేమను అర్థం చేసుకున్న పెద్దలు చివరికి మమ్మల్ని క్షమించేశారు. హైదరాబాద్‌లో ఓ ఇంటి వారిమయ్యాం. విదేశాలకు వెళ్లే అవకాశాలు వచ్చినా మా పేరెంట్స్‌ను చూసుకునేందుకు మా ప్రభాకర్ వాటిని సున్నితంగా తిరస్కరిస్తారు. ఏమాత్రం సెలవు దొరికినా మా పేరెంట్స్‌కే టైం కేటాయిస్తాం. – స్వప్న– ప్రభాకర్

అప్పట్లో చాలా కష్టపడ్డాం



నాది జగిత్యాల, ఆమెది కరీంనగర్. డిగ్రీ చదువుకునే రోజుల్లో మాకు ఎన్‌సీసీలో పరిచయం. పీజీకి వెళ్లాక కూడా కొనసాగింది. అపుడే ఎస్సై నోటిఫికేషన్ వచ్చింది. దీంతో తనకు దాదాపుగా ఏడాది దూరంగా ఉండి ప్రిపేరయ్యా. ఈ లోపు విషయం ఇంట్లో తెలిసిపోయింది. దీంతో తన కుటుంబ సభ్యులు మొదట్లో వ్యతిరేకించారు. నేను ఎస్సైగా సెలెక్ట్ అయ్యాక మరో ఏడాది దూరంగా ఉన్నాం. పోస్టింగ్ తీసుకున్నాక వెళ్లి వారిని ఒప్పించా. తొలుత వ్యతిరేకించినా... కొన్నిరోజులకు కలిసిపోయాం. ఇపుడు నేను సీఐగా మానుకోటలో విధులు నిర్వహిస్తున్నా. మాకిద్దరు పాపలు. కులాలు వేరైనా జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకుంటే అంతా ఆమోదిస్తారు. – సుష్మ– రవిరాజ్

కుటుంబ వ్యవస్థకు ప్రాధాన్యం ఇవ్వాలి



వాలంటైన్ డే మన సంస్కృతి కాదు. కుటుంబ వ్యవస్థకు ప్రాధాన్యం ఇవ్వాలి. పిల్లలు తల్లిదండ్రుల అభిప్రాయాలను గౌరవించాలి. ఇతరులను కాదు.. నిన్ను నీవు ముందుగా ప్రేమించుకోవాలి. కుటుంబ వ్యవస్థను గౌరవిస్తే బాగుంటుంది. – గిరిప్రసాద్, ఏసీపీ, గోదావరిఖని

మనల్ని మనం ప్రేమించుకోవాలి



ప్రేమ బలం, బలహీనత, ఆకర్షణ కాదు. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, స్నేహితులందరి నుంచి పొందేదే ప్రేమ. పాశ్చాత్య ధోరణి నుంచి వచ్చే వాలంటైన్‌డే పేరిట జీవితం నాశనం చేసుకోవద్దు. – శశికాంత్, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- జిల్లా వ్యాప్తంగా 35 కేంద్రాలు
- పరీక్షలకు 5,035 మంది హాజరు
- ఈనెల 15 నుంచి మార్చి 2 వరకు..

సుల్తానాబాద్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్స్ ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్నాయని నోడల్ ఆఫీసర్ కల్పన తెలిపారు. మార్చి రెండో తేదీవరకు ప్రాక్టికల్స్ ఉంటాయని, ఇందుకు జిల్లా యంత్రాంగం సర్వంసిద్ధం చేసిందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 35 కేంద్రాల్లో 5,035 మంది హాజరు కానున్నారు. ఇందుకు సంబంధించిన టైంటేబుల్‌ను ఇంటర్ బోర్డు విడుదల చేసిన విషయం తెలిసిందే. మూడు విడతల్లో జరిగే ప్రాక్టికల్స్‌కు జిల్లా పరీక్షల కమిటీ (డెక్)ని నియమించారు.

15 నుంచి మొదటి విడత

ఈ నెల 15 నుంచి 20వరకు మొదటి విడత.. ఈనెల 21 నుంచి 25 వరకు రెండో విడత, ఈనెల 26 నుంచి మార్చి రెండో తేదీ వరకు మూడో విడతలో ప్రాక్టికల్స్ జరుగుతాయి. జనరల్ కోర్సుల్లో ఎంపీసీ, బైపీసీలో 2,767 మంది హాజరు కానున్నారు. ఒకేషనల్ కోర్సుల్లో 2,274 మంది ఉన్నారు. వీరందరి కోసం 35 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రయోగశాలలను సిద్ధం చేయాలని ఆయా కళాశాలలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పరీక్షల కమిటీకి కన్వీనర్‌గా డీఐఈవో కల్పన, సభ్యులుగా రామగుండం ప్రిన్సిపాల్ మదర్, గోదావరిఖని ఫిజిక్స్ లెక్చరర్ శ్రీధర్‌ను నియమించారు.

సమయం ఇలా..

ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. తిరిగి మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రాక్టికల్స్ ఉంటాయి. హాల్ టికెట్‌పై విద్యార్థి వివరాలు, సబ్జెక్టులు, తేదీ, సమయంలో పొరపాట్లు ఉంటే వెంటనే వాటిని డెక్ సభ్యులకు తెలియజేయాల్సి ఉంటుంది. వారు ఇంటర్ బోర్డు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారు. ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలి.



అధికారులతో సమీక్షిస్తున్న నోడల్ ఆఫీసర్ కల్పన



డిబేట్‌లో పాల్గొన్న ట్రినిటి కళాశాల విద్యార్థులు

పెద్దలు కుదిర్చిన పెళ్లికే జై..!

'సాక్షి' డిబేట్‌లో యువతీయువకుల మనోగతం

సాక్షి, పెద్దపల్లి: పెద్దల అంగీకారంతో చేసుకునే వివాహమే సాఫీగా సాగుతుందని, ఆనందంగా ఉంటుందని యువత అభిప్రాయపడుతోంది. ఒకవేళ ప్రేమపెళ్లి అయినా పెద్దలు ఒప్పుకుంటేనే.. జీవితం హ్యాపీగా ఉంటుందని చెబుతోంది. ప్రపంచ వ్యాప్తంగా మంగళవారం వాలంటైన్స్ డే జరుపుకుంటున్న సందర్భంగా జిల్లాలోని ట్రినిటి డిగ్రీ, పీజీ కళాశాలలో 'సాక్షి' ఆధ్వర్యంలో డిబేట్ నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

- ప్రేమ.. పెద్దల ఆప్యాయత అవసరమన్న యువత
- పెద్దల దీవెనలతో ప్రేమపెళ్లి చేసుకోవాలని పిలుపు
- వాలెంటైన్స్ డే సందర్భంగా ట్రినిటి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల అభిప్రాయం

ప్రేమపెళ్లితో కట్నం, కుల నిర్మూలన వంటి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కొందరు అభిప్రాయపడగా.. జీవితంలో స్థిరపడిన తరువాతే ప్రేమ పెళ్లి అయినా.. పెద్దలు కుదిర్చిన పెళ్లి అయినా.. చేసుకోవాలని వెలిబుచ్చారు. చర్చవేదికలో కళాశాల కరస్పాండెట్ టి.రాజు, వైస్ ప్రిన్సిపాల్ సీతారెడ్డి, ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ బందారి రమేశ్ పాల్గొన్నారు.

సర్వే వివరాలు

డిబేట్‌లో పాల్గొన్న విద్యార్థులు 40 మంది

విద్యార్థులు 10 మంది.. విద్యార్థినులు 30 మంది

ప్రేమ పెళ్ల :12 - పెద్దలు కుదిర్చిన పెళ్ల :28

జీవితంలో స్థిరపడ్డాక పెళ్ల :35

భయంతో మధ్యలో చేసుకోవడం :05

ప్రేమ పేరుతో దాడులు సరైనవే :0

ప్రేమ పేరుతో దాడులు తప్పు :40

కులాంతర, మతాంతర వివాహాలు సరే :22

కులాంతర, మతాంతర వివాహాలు సరికాదు :18

ప్రేమ విషయంలో పెద్దల తీరు సరైనదే :26


ప్రేమ విషయంలో పెద్దల తీరు తప్పు :14

స్థిరపడ్డాకే



పెద్దల అంగీకారం లేకుండా ప్రేమ పెళ్లి చేసుకుంటే తర్వాత ఇబ్బందులు ఎదురవుతాయి. తల్లిదండ్రులు మన జీవితం గురించే ఆలోచిస్తారు కాబట్టి వాళ్లు చూసిన వారినే పెళ్లి చేసుకుంటే ఫ్యామిలీ నుంచి సపోర్ట్ ఉంటది. ముందుగా కష్టపడి చదువుకుని జీవితంలో మంచి ఉద్యోగం సాధించి స్థిరపడిన తరువాత తల్లిదండ్రులు చూపించిన వివాహం చేసుకుని వారిని సంతోష పెట్టాలి. – సాయి తేజస్విని

స్థిరపడటానికి తొందరపడాలి



విద్యార్థులు సినిమాల ప్రభావంతో ప్రేమ అంటూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ప్రేమించడం.. పెళ్లి చేసుకోవడానికి తొందరపడటం కంటే ముందుగా జీవితంలో స్థిరపడటానికి ప్రయత్నించాలి. ఇరువురి మధ్య పరస్పర అవగాహన, నమ్మకం కలిగాక చేసుకునే పెళ్లికి కులాలు, మతాలు అడ్డుకావు. ఆర్థిక స్వాతంత్య్రం, పరిణతి, విజయం సాధిస్తే జీవితం పూలబాటే. –టి.రాజు, ట్రినిటి డిగ్రీ, పీజీ కళా శాల ప్రిన్సిపాల్

ఏడు తరాలు చూడాలి



పెద్దలు సంబంధాలు చూసేటప్పుడు అటు ఏడుతరాలు, ఇటు ఏడు తరాలు చూసి పెళ్లి చేయాలంటారు. దానివల్ల ఎలాంటి వారో తెలుస్తుంది. భవిష్యత్‌లో ఏమైనా సమస్యలు వస్తే వారి బంధువుల సమక్షంలో గొడవలు పెద్దగా కాకుండా పెద్దలు దంపతుల మధ్య సయోధ్య కుదుర్చుతారు. దాంపత్య జీవితం ఆనందంగా సాగుతుంది. – సౌజన్య, విద్యార్థిని

తేడా తెలుసుకోవాలి



ప్రేమ పేరుతో విద్యార్థులు జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. ప్రేమ, ఆకర్షణకు తేడా తెలుసుకోవాలి. లవ్ మ్యారేజ్ మంచిదే అయితే.. ప్రస్తుతం సమాజంలో ఎంతోమంది విడాకులు తీసుకుంటున్నారు. అదే పెద్దలు కుదిర్చిన వివాహంలో సమస్యలు వస్తే ఇరువైపులా తల్లిదండ్రులు సపోర్టుగా ఉంటూ.. సర్ది చెబుతారు. – రమ్య, విద్యార్థిని

అర్థం చేసుకునేవారైతే ఏదైనా ఒకే..



ఒకరినొకరు అర్థం చేసుకోగలిగితే ప్రేమపెళ్లయినా.. పెద్దలు కుదిర్చినదైనా ఇబ్బంది ఉండదు. వివాహ బంధానికి ఇద్దరూ విలువ ఇవ్వాలి. ఇప్పటికీ కులాంతర, మతాంతర వివాహాల పట్ల సమాజంలో వ్యతిరేకత చాలా ఉంది. కులాంతర వివాహాలతో పరువు హత్యలకు దారితీస్తున్నాయి. ఇలాంటివి పోవాల్సిన అవసరముంది. – అంజలి, విద్యార్థి

భవిష్యత్ బాగుంటుంది



తల్లిదండ్రులను బాధ పెట్టకుండా పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకుంటే భవిష్యత్ ఎంతో బాగుంటుంది. లవ్ మ్యారేజ్ లైఫ్ బాగుంటుంది. నచ్చిన వారు జీవిత భాగస్వామి అయితే జీవితం ఆనందంగా ఉంటుంది. ఇద్దరూ ఒకరికి ఒకరు తెలిసిన తర్వాత వివాహ బంధానికి వెళితే బంధం బలంగా ఉంటుంది. ఎదైనా సమస్య వచ్చినా ఒకరినొకరు అర్థం చేసుకోగలుగుతారు. – మంజూష, విద్యార్థిని

లక్ష్యాన్ని ప్రేమించండి..



విద్యార్థి దశలో సహజంగా కలిగే ఆకర్షణకు లోనుకాకుండా విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాన్ని ప్రేమించాలి. జీవితంలో ఉన్నతస్థానానికి ఎదిగి స్థిరపడితే అన్నీ దగ్గరకు వస్తాయి. అప్పుడు తల్లిదండ్రులూ నచ్చిన వారితో వివాహం జరిపిస్తారు. ప్రేమ పేరిట సమాజంలో జరుగుతున్న సంఘటనలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. – ఎం.సీతారెడ్డి, ట్రినిటి డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్

పెద్దలు కుదిర్చిన పెళ్లితో ఇబ్బందులుండవ్..



ప్రేమించి పెళ్లి చేసుకోవాలన్నప్పుడు అమ్మాయి తల్లిదండ్రులను.. అబ్బాయి తల్లిదండ్రులను ఒప్పించుకోవాలి. జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లి చేసుకుంటే ఎటువంటి సమస్యా ఉండదు. ప్రేమిస్తే పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవడమే మంచిది. పెద్దలు కుదిర్చిన పెళ్లి అయితే ఇరు కుటుంబాల వారు కష్టనష్టాలు చూసుకుంటారు. పెళ్లి తర్వాత ఏదైనా సమస్య వచ్చినా చర్చించి పరిష్కరిస్తారు. – కావ్యశ్రీ, విద్యార్థిని

కట్న సమస్యకు చెక్



పేద కుటుంబాల తల్లిదండ్రులు అరేంజ్ మ్యారేజ్‌లో అడిగినంత కట్నం ఇవ్వలేక ఇబ్బంది పడుతున్నారు. అప్పుల పాలవుతున్నారు. ప్రేమ వివాహాలతో సమాజంలో కొంత కట్న సమస్యకు చెక్ పెట్టవచ్చు. ప్రేమ వివాహం చేసుకునే వారు జీవితంలో స్థిరపడి, పరిణతి చెందితేనే వారి జీవితం హ్యాపీగా సాగుతుంది. అటువంటి ప్రేమపెళ్లిని అందరూ స్వాగతించాలి. – అమిత్ శర్మ, విద్యార్థి

అరేంజ్ మ్యారేజ్‌తో హ్యాపీ



ఎవరి సంప్రదాయాలు వారికి ప్రాధాన్యమే. మతాంతర వివాహాలు చేసుకుంటే వాళ్ల సంప్రదాయాలకు అనుగుణంగా ఉండకపోవడం ద్వారా ఇరువురి మధ్య విబేధాలు వస్తాయి. ఒకరినొకరు అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. ఇందుకు మతాంతర వివాహాలు ఎటువైపో దారితీస్తాయి. పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకుంటే ఇరువురు సంతోషంగా ఉంటారు. – సాక్షిత, విద్యార్థిని

క్లుప్తంగా

ఉపాధి పనులు మార్చి 15వరకు పూర్తి కావాలి



మాట్లాడుతున్న కుమార్ దీపక్

పెద్దపల్లిరూరల్: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులను మార్చి 15 వరకు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మాట్లాడారు. ఇతర పనులు చేసే కూలీల సంఖ్య మరింత పెంచాలన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసిన వారికి బిల్లులు చెల్లిస్తారన్నారు. డీఆర్‌డీఓ శ్రీధర్, ఎంపీడీఓ రాజు తదితరులున్నారు.

డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలేవీ..?



కలెక్టరేట్ ఎదుట నిరసన కు దిగిన నాయకులు

పెద్దపల్లిరూరల్: రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం చేసి.. బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. దళారుల చేతిలో మోసపోయిన ముంజ హరీశ్ ఆత్మహత్య చేసుకున్నాడని, అతడి కుటుంబానికి ఇప్పటికీ పరిహారం అందలేదని నాయకులు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, రమేశ్, వెంకన్న, శంకర్, కృష్ణ, క్రాంతిగౌడ్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు అందించాలన్నారు. రైతాంగానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

డిప్యూటీ చైర్మన్‌కు కోలేటి సన్మానం



సన్మానిస్తున్న కోలేటి దామోదర్

గోదావరిఖని: శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బండా ప్రకాశ్‌ను రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ సోమవారం సన్మానించారు. శాసనమండలిలోని ఆయన చాంబర్‌లో కలుసుకున్నారు.

పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దండి



వినతిపత్రం ఇస్తున్న స్వామి వివేక్ పటేల్

సుల్తానాబాద్: జిల్లాలోని రామగిరి ఖిల్లా, ఎలిగేడు మండలం ధూళికట్ట బౌద్ధ స్తూపం, సబ్బితం జలపాతాన్ని పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించినట్లు మున్నూరుకాపు యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామివివేక్‌పటేల్ తెలిపారు. సోమవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు.

సుల్తానాబాద్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నోటీసు



కలెక్టర్ సంగీతకు వినతి పత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

- కలెక్టర్‌కు 12 మంది కౌన్సిలర్ల వినతి
- అధికార పార్టీ కౌన్సిలర్లతో జత కలిసిన కాంగ్రెస్
- జిల్లాలో తొలిసారి తిరుగుబావుటా..

సుల్తానాబాద్: జిల్లాలో మొదటిసారిగా సుల్తానాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు అసమ్మతి రాగం అందుకున్నారు. జిల్లాలో సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథని మున్సిపాలిటీలుగా.. రామగుండం కార్పొరేషన్‌గా ఉన్నాయి. మూడేళ్ల క్రితం వరకు మేజర్ గ్రామ పంచాయతీలుగా ఉన్న సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలుగా ఆవిర్భవించాయి. ఈ క్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్‌లో మెజార్టీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్ ముత్యం సునీతపై అవిశ్వాసంతో ఉన్నట్లు కలెక్టర్ సంగీతకు సోమవారం నోటీస్ అందించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని కలిసి చర్చిస్తామని వారం క్రితమే చెప్పినా మెజార్టీ సభ్యులు అవిశ్వాసానికే మొగ్గు చూపడం చర్చనీయాంశంగా మారింది.

15 మంది కౌన్సిలర్లు..

సుల్తానాబాద్ మున్సిపల్‌లో 15 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరులో 9 మంది బీఆర్‌ఎస్.. ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు. కాంగ్రెస్ నుంచి గెలిచిన సిద్ధ కనకయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ప్రస్తుతం 14 మంది కౌన్సిలర్లు ఉన్న మున్సిపాలిటీలో 12 మంది (పసిడ్ల మమత, గాజుల లక్ష్మి, ఎండీ నిశాంత్, బిరుదు సమత, కూకట్ల గోపి, చింతల సునీత, గొట్టం లక్ష్మి, అనుమాల అరుణ, రేవల్లి తిరుపతి, దున్నపోతుల రాజయ్య, గుర్రాల శ్రీనివాస్) తమ సంతకాలతో కూడిన లేఖను కలెక్టర్‌కు అందించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి సతీమణి, కౌన్సిలర్ పారుపల్లి జ్ఞానేశ్వరి, మరో కాంగ్రెస్ కౌన్సిలర్ ఊట్ల వరప్రదీప్ మాత్రం అసమ్మతివాదుల వెంట వెళ్లలేదు.

ఎమ్మెల్యే అభిప్రాయం లేకుండానే..?

మెజారిటీ సభ్యులతో మాట్లాడిన తర్వాత ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నిర్ణయమే ఫైనల్ అని చెప్పిన కౌన్సిలర్లు.. ఆయన తన అభిప్రాయాన్ని చెప్పక ముందే ఇలా అవిశ్వాసానికి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వడం స్థానికంగా చర్చకు దారితీస్తోంది. రాజకీయంగా చైతన్యం ఉన్న సుల్తానాబాద్ మున్సిపల్‌లో భవిష్యత్‌లో మరిన్ని పరిణామాలు చోటు చేసుకునే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు.

కలిసిపోయిన కాంగ్రెస్..

చైర్‌పర్సన్ ముత్యం సునీతపై అవిశ్వాసానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఒక్కటైనట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లిన మెజారిటీ సభ్యులు.. అక్కడే అవిశ్వాసం పెట్టాలని ప్రమాణం చేసినట్లు తెలుస్తోంది. సునీత కాకుండా ఎవరినైనా ఎన్నుకోవచ్చని కొందరు కౌన్సిలర్లు అభిప్రాయపడినట్లు చర్చ సాగుతోంది. సునీత భర్త రమేశ్ ఏకచత్రాధిపత్యం చేయడంతోపాటు కౌన్సిలర్లకు కనీస మర్యాద ఇవ్వడం లేదని, అభివృద్ధి విషయం పక్కన పెడితే కలుపుకొని వెళ్లడం లేదని పేర్కొంటున్నారు. మేజర్ పంచాయతీ పాలకవర్గం సమయంలో పనిచేసిన వార్డు సభ్యులకు మూడునెలలకోసారి విందులు ఏర్పాటు చేసేవారని, ఆత్మీయంగా మాట్లాడేవారని, ఇప్పుడా పద్ధతి లేదని చెప్పడం విశేషం. ఒకరినొకరు కలవకుండా.. ఒక్కొక్కరితో చర్చించి పంపిస్తున్నారు తప్ప.. అందరిని కలుపుకొని వెళ్లడం లేదని వాదిస్తున్నారు.

ప్రకటనలకే పరిమితమైన పథకాలు



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మక్కాన్‌సింగ్

- మక్కాన్‌సింగ్ ఇంటింటా ప్రచారం
- కాంగ్రెస్‌లో చేరిన మాజీ వైస్ ఎంపీపీ

గోదావరిఖని: కాంగ్రెస్ హయాంలో అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయని, నేడు బీఆర్‌ఎస్ పాలనలో ప్రకటనలకే పరిమతమయ్యాయని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ తెలిపారు. సోమవారం కార్పొరేషన్‌లోని 11, 12 డివిజన్లలో పర్యటించారు. గడపగడపకూ తిరుగుతూ ప్రతి ఒక్కరి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్రాల బడ్జెట్ సామాన్యులకు అందని ద్రాక్షలాగా మారిందన్నారు. రామగుండంలో అసమర్థ పాలన కొనసాగుతోందని, ఎన్నికల సమయంలో ఓసీపీ–5 విస్తరణకు వ్యతిరేకమని, తీరా గెలిచాక యాజమాన్యంతో కుమ్మక్కై.. ఓసీపీకి సహకరించారని విమర్శించారు. ప్రభావిత ప్రాంతంగా డివిజన్లకు ప్రత్యేక డీఎంఎఫ్టీ నిధులు కేటాయించి.. రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, 24గంటలు తాగునీటి సరఫరా, మొక్కల పెంపకం, పార్కుల నిర్మాణాలు, ప్రతినెలా రెండుసార్లు వైద్య శిబిరాలు నిర్వహించాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. నాయకులు బొంతల రాజేష్, కాల్వ లింగస్వామి, ఎండీ ముస్తఫా, పెద్దెల్లి తేజస్విని, పెద్దెల్లి ప్రకాష్, గుడికందుల రవి, గట్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలను బీఆర్‌ఎస్ కాపీ కొట్టింది

రామగుండం: కాంగ్రెస్ పార్టీ పథకాలను అధికార పార్టీ కాపీ కొడుతోందని మక్కాన్‌సింగ్‌ఠాకూర్ ఆరోపించారు. అంతర్గాం మండల పరిధిలోని గోలివాడలో ఇంటింటా ప్రచారం చేశారు. గ్రామానికి చెందిన పూర్వపు రామగుండం మాజీ వైస్ ఎంపీపీ ఆవుల గోపాల్‌యాదవ్ తన అనుచరులతో పార్టీలో చేరగా.. మక్కాన్‌సింగ్ వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండల ప్రతినిధులు పెండ్రు హన్మాన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, లింగమూర్తి, మద్దీ తిరుపతిగౌడ్, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, మాడ కొండల్‌రెడ్డి, గాదె సుధాకర్ తదితరులున్నారు.

ప్రజా'వాణి' వినండమ్మా..

- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు
- 51 దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ సంగీత



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగీత, అధికారులు

పెద్దపల్లిరూరల్: 'పెద్దపల్లి పట్టణంలోని బందారికుంటలో గల 37గుంటల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారు.. ఆ భూమిని కాపాడి ప్రజావసరాల కోసం వినియోగించేలా చూడాలి..' అని కాలనీకి చెందిన ఆరెంద వెంకటస్వామి కోరారు.

'నాకున్న 1.20 ఎకరాల భూమిని ముగ్గురు వారసులకు విరాసత్ చేయాలని కోరుతున్నా అధికారులు స్పందించడం లేదు..' అని కాల్వశ్రీరాంపూర్ మండలం మడిపల్లి గ్రామానికి చెందిన మారుపాక స్వామి కలెక్టర్‌కు మొరపెట్టుకున్నాడు. ఇలా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 51 దరఖాస్తులను కలెక్టర్ సంగీత, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్ అందుకున్నారు. అందులో 35 దరఖాస్తులు రెవెన్యూ సంబంధమైనవే కాగా.. మిగతా 16 ఇతర శాఖలకు సంబంధించినవని పేర్కొన్నారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కారమయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరిష్కార సాధ్యం కాని వాటి సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదుదారులకు కారణాలతో తెలపాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు.

పింఛన్ జమ కావడం లేదు



వృద్ధాప్య పింఛన్ మంజూరు చేస్తూ ప్రభుత్వం కార్డు జారీ చేసింది. కానీ పింఛన్ డబ్బులు బ్యాంకు ఖాతాకు జమ కావడం లేదు. అడిగితే ఎవరూ పట్టించుకుంటలేరు. సమస్యకు పరిష్కారం చూపి ఖాతాకు పింఛన్ జమ అయ్యేలా చూడాలి. – కలవేన రాములు, బంధంపల్లి

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయండి



డయాలసిస్ పేషంట్ల కోసం జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన ఏర్పాట్లు చేయాలి. ఈ ప్రాంతానికి చెందిన పేషెంట్లు కరీంనగర్, జగిత్యాల, గోదావరిఖని తదితర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. వీలైనంత త్వరగా డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి. – బి.సురేశ్‌గౌడ్, కొమురయ్య, జగదీశ్ కాంగ్రెస్ నాయకులు

బొగ్గుబాయి వార్తలు

మిగిలింది 47 రోజులే..

రామగిరి(మంథని): ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు లక్ష్య సాధనకు 47రోజులే ఉందని సంస్థ డైరెక్టర్లు ఎన్.బలరాం (ఫైనాన్స్, పర్సనల్), డి.సత్యనారాయణరావు (ఈఅండ్ ఎం), ఎన్వీకే.శ్రీనివాస్(ఆపరేషన్స్), జి.వెంకటేశ్వరరెడ్డి (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) తెలిపారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బొగ్గు ఉత్పత్తికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. ప్రతిరోజూ 2.3లక్షల టన్నులకు తగ్గకుండా ఉత్పత్తి, రవాణా చేయాలని, ఇందుకు ఏరియా జీఎంలు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఆదేశించారు. షిఫ్టులవారీగా రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. ఓవర్‌బర్డెన్ తొలగింపు కాంట్రాక్టులు సమకూర్చామని, ఏరియాల వారీగా జీఎం ఆధ్వర్యంలో ప్రాజెక్టు అధికారులు, ఏజెంట్లు, మేనేజర్లతో సమీక్షలు నిర్వహించుకుని రోజుకు 17 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తీసేలా చూడాలన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) జె.అల్విన్ మాట్లాడుతూ ఉత్పత్తితోపాటు నాణ్యతపైనా దృష్టి సారించాలని సూచించారు. సాధించాల్సిన లక్ష్యాలను జీఎం(కోఆర్డినేషన్)ఎం.సురేశ్ వివరించారు.

యంత్రాలతో లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న అడ్వైజర్ మైనింగ్ డీఎస్.ప్రసాద్

రామగిరి(మంథని): సింగరేణిలో అత్యాధునిక యంత్రాలను వినియోగించుకుని ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని అడ్వైజర్ మైనింగ్ డీఎస్. ప్రసాద్ సూచించారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలను సందర్శించి ఉత్పత్తిపై ఆరా తీశారు. సెంటినరీకాలనీలోని జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. రక్షణ, బొగ్గు ఉత్పత్తి, ఓసీపీ గనుల్లో ఓబీ, బొగ్గు రవాణా అంశాలపై చర్చించారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు కొద్దిరోజులే ఉందని, ప్రణాళిక ప్రకారం ఉత్పత్తి సాధించాలని సూచించారు. ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వరరావు, ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజినీర్ సీతారామం, ఎస్‌ఓటూ జీఎం డి.బైద్య, ప్రాజెక్ట్ అధికారులు ఎన్.రాధాకృష్ణ, ఎం.నరేందర్, కె.నాగేశ్వరరావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ టి.రఘురాం, డీజీఎంలు కాశీవిశ్వేశ్వరరావు, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి చేయాలి

గోదావరిఖని: వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి చేయాలని డీఎస్.ప్రసాద్ కోరారు. సోమవారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–5 ఓసీపీని పరిశీలించారు. ఓసీపీలో ఉన్న ఫైర్, బొగ్గు నాణ్యత, యంత్రాల పనితీరు తెలుసుకున్నారు. బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణాపై అధికారులతో సమీక్షించారు. ఆర్జీ–1 జీఎం కె.నారాయణ, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, మేనేజర్ అనిల్ గబాలే ఉన్నారు. అనంతరం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 క్వారీని పరిశీలించారు. ఓసీపీ–3 వ్యూ పాయింట్ ద్వారా పనిస్థలాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్ సలీం, ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ దుర్గాప్రసాద్, డీజీఎం ఐఈ మురళీకృష్ణ, ఓసీపీ–3 మేనేజర్ డి.రమేశ్ ఉన్నారు.

గీత కార్మికులకు భూమి కేటాయించాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: గీత కార్మికుల జీవనోపాధికి పదెకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కోరారు. మంత్రిని హైదరాబాద్‌లో కలిసిన చందర్ ఆయనకు వినతిపత్రం అందించారు. ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి ఓసీపీ విస్తరణతో గీత కార్మికులకు ఈతవనం లేకుండా పోయిందని, పాలకుర్తి, అంతర్గాం మండలంలో పదెకరాలు గీత పారిశ్రామిక సహకార సంఘం గ్రూప్ నంబర్‌వన్‌కు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట సంఘం నాయకులు సురేందర్, రాజ్‌కుమార్, కృష్ణ, శ్రీనివాస్, కుమార్ ఉన్నారు.

ఎల్లంపల్లి నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లించండి

ఎల్లంపల్లి భూ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఎమ్మెల్యే చందర్ కోరారు. మంత్రిని హైదరాబాద్‌లో కలుసుకున్నారు. వేంనూర్, కుక్కలగూడూర్, మూర్మూర్, ఉండెడ, ఎల్లంపల్లి, పొట్యాల, మద్దిర్యాల నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ కింద రూ.22కోట్లు ఇవ్వాలని కోరారు. సర్పంచులు కొలలత, గుమ్ముల రవీందర్, బాదరవేని స్వామి, ఎంపీటీసీ మస్కం శ్రీనివాస్ తదితరులున్నారు.

జీజీహెచ్‌లో గర్భిణికి మెరుగైన శస్త్రచికిత్స



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మల్లేశ్వరి

కోల్‌సిటీ: రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో నెలలు పూర్తిగా నిండని గర్భిణికి వైద్య బృందం క్లిష్టమైన ఆపరేషన్ చేసి ఆమెకు ప్రాణం పోశారు. కడుపులోని బిడ్డనూ బతికించారు. ఆస్పత్రి వైద్యులు, బాలింత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కమాన్‌పూర్ మండలం జూలపల్లికి చెందిన ఇరుగురాల మల్లేశ్వరి మూడో కాన్పులో 8వ నెల వచ్చేసరికి తీవ్ర అనారోగ్య సమస్యలు ఏర్పడ్డాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆదివారం మధ్యాహ్నం రామగుండం జీజీహెచ్ ఆస్పత్రికి తీసుకురాగా, పరీక్షించిన వైద్యులు వెంటనే ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. డీజీవో ప్రొఫెసర్ డాక్టర్ అరుణ నేతృత్వంలో డీజీవో కళ్యాణి, అనస్తీషియా నిపుణులు బానులక్ష్మి, అజార్ వైద్యం వెంటనే గర్భిణికి శస్త్ర చికిత్స నిర్వహించారు. ఎనిమిది బాటిళ్ల రక్తంను ఎక్కించి, సకాలంలో ఆపరేషన్ చేసి ప్రాణాపాయంతో ఉన్న తల్లిని రక్షించడానికి గర్భసంచి తొలగించి బిడ్డను బతికించారు. బిడ్డకు ఎస్ఎన్‌సీయూలో, బాలింతకు ప్రసూతీ వార్డులో మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ఆదివారం అయినప్పటికీ సకాలంలో గర్భిణిని అడ్మిట్ చేసుకుని వైద్య బృందం శస్త్రచికిత్స అందించడంపై పలువురు అభినందించారు. వైద్య బృందాన్ని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్, సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ఆర్ఎంవోలు, హెచ్‌వోడీలు అభినందించారు.

'ఉన్నతి'ని వినియోగించుకోవాలి

రామగిరి: వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న ఉపాధి కూలీలు ఉన్నతి పథకం ద్వారా అందించనున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ సత్యనారాయణ సూచించారు. ముత్తారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మాట్లాడారు. కూలీల వలసలను నియంత్రించడానికి ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని తెచ్చాయని, వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలకు ఉచిత వసతి, భోజనం అందిస్తూ వివిధ ఉపాధి శిక్షణలు అందిస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరావు, కేవీకే శాస్త్రవేత్తలు వై.వెంకన్న, కిరణ్ పిల్లి, ప్లేస్‌మెంట్ ట్రైయినర్ రవి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వేణుమాధవ్, ఏపీవో దయామణి, కూలీలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

జ్యోతినగర్: అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎన్టీపీసీ రామగుండంలో సోమవారం చోటుచేసుకుంది. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌కు చెందిన బొల్లేటి రవీందర్ (62) ఆటోడ్రైవర్. కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకున్నాడు. రవీందర్ భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఏఎస్సై చక్రపాణి తెలిపారు.

అప్పుల బాధతో వృద్ధుడు ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌కు చెందిన కల్వల రాజేశం (60) అప్పుల బాధతో సోమవారం తాటివనంలోని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై రాజేశ్ తెలిపారు. గీత వృత్తిపై ఆధారపడిన రాజేశం.. ఇటీవల ఇంటి ని ర్మా ణం కోసం అప్పు చేశాడు. ఆ అప్పు తీర్చలేక మదనపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ అ ఘాయిత్యానికి పాల్పడ్డాడని పోలీసులు తె లిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

'ఫ్యామిలీ డే' ఘనంగా నిర్వహించాలి

గోదావరిఖని: సింగరేణి సీఈఆర్‌క్లబ్ ఫ్యామిలీడే వేడుకలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ కోరారు. ఈనెల 17న యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్‌లో వేడుకలు ఉంటాయన్నారు. 15న సాయంత్రం నాలుగు గంటలకు మహిళా ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు క్యారమ్, చెస్, షెటిల్ బాడ్మింటన్, బాల్‌ఇన్ బాస్కెట్, బెలూన్‌త్రెడ్ పోటీలు ఉంటాయని, 16న సాయంత్రం నాలుగు గంటలకు ఉద్యోగులు, వారి పిల్లలకు లాన్‌టెన్నీస్, టేబుల్‌టెన్నీస్, బాడీబిల్డింగ్, వెయిట్‌లిఫ్టింగ్, షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్ పోటీలుంటాయని, విజేతలకు ఫ్యామిలీడే రోజు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా



అంగీకార పత్రాన్ని అందజేస్తున్న మేయర్

కోల్‌సిటీ: వవిద్యుత్‌షాక్‌తో మృతి చెందిన నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి అండగా నిలిచేందుకు నగరపాలక సంస్థ పాలకవర్గం ముందుకు వచ్చింది. సోమవారం రాత్రి నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, ఎన్పీడీసీఎల్ అధికారులతో కార్మిక, ప్రజా సంఘాల నాయకులు చర్చలు జరిపారు. ఇటీవల రోడ్డుపై చెత్తను తొలగిస్తున్న పనుల్లో విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన సందీప్, చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి చెందాడు. కాగా, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కార్మిక సంఘాలు నిరసన తెలిపాయి. దీంతో స్పందించిన పాలకవర్గం, అధికారులు మరణించిన సందీప్ కుటుంబానికి ఎన్పీడీసీఎల్ నుంచి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఎన్పీడీసీఎల్‌లో కాంట్రాక్టుఉద్యోగం ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే నగరపాలక సంస్థ నుంచి రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి కాంట్రాక్ట్ ఉద్యోగం ఇవ్వడానికి, నగరపాలక సంస్థ తరపున మేయర్, డిప్యూటీ మేయర్ అంగీకరించారు. ఎమ్మెల్యే సహకారంతో సందీప్ కుటుంబానికి దళిత బంధు సాయం, ఇల్లు కట్టుకోవడానికి రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. చర్చల్లో కార్పొరేటర్ కన్నూరి సతీశ్, కార్మిక సంఘాల నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, వై.యాకయ్య, పాతిపెల్లి ఎల్లయ్య, బొడ్డు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని చర్చలు



చర్చల్లో పాల్గొన్న జేఏసీ నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యం.. కాంట్రాక్టర్లు, కార్మిక సంఘాల జేఏసీ నాయకుల మధ్య సోమవారం జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతీ కనిపించలేదు. 2018నాటి ఒప్పందంలోని కొన్ని అంశాలపై జరిగిన జాప్యం, కొత్త వేతన ఒప్పందంపై కార్మిక సంఘాలు యాజమాన్యానికి డిమాండ్ నోటీసు ఇచ్చాయి. దీనిపై ప్రాజెక్టు పరిపాలనా భవనంలో చర్చలు జరిపారు. కార్మిక సంఘాల నాయకులు వేతన ఒప్పందంలోని అంశాల పత్రాలను అందించారు. ఈనెల 28న హైదరాబాద్‌లోని రీజనల్ లేబర్ కమిషనర్ సమక్షంలో మరోసారి చర్చలు జరుగనున్నాయని జేఏసీ నాయకులు వెల్లడించారు. పాత ఒప్పందంలో పెండింగ్ అంశాలు, కొత్త వేతన ఒప్పందంపై చర్చించే అవకాశం ఉందన్నారు. ముందుగా ప్రాజెక్టుకు బదిలీపై వచ్చిన ఏజీఎం(హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్‌ను కార్మిక సంఘాల నాయకులు సన్మానించారు. సమావేశంలో జేఏసీ నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, భూమల్ల చందర్, రాధారపు రాజమల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.